

కాచిగూడలో పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ వైశ్య హాస్టల్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు

రూ. 1.8 కోట్లతో వరద నీటి పైపులైన్

బర్కత్‌పుర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం కాచిగూడ డివిజన్ వైశ్య హాస్టల్ సమీపంలో పెట్రోలు బంక్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు రూ. 1.8 కోట్లతో నిర్మిస్తున్న వరద నీటి పైపులైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలో వరద నీటి పైపులైన్ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగంగౌడ్, బుచ్చిరెడ్డి, బి. కృష్ణాగౌడ్, బీజేపీ నాయకులు కన్నె రమేష్ యాదవ్, సుభాష్‌పటేల్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'గీతాంజలి'లో విద్యార్థి నాయకుల ఎన్నిక



విద్యార్థి నాయకుడికి బ్యాడ్జి పెడుతున్న జైసూర్య

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యార్థి నాయక బృంద ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు రహస్య ఓటింగ్ ద్వారా నాయకులను ఎన్నుకున్నారు. గాంధీ, అంబేడ్కర్, రవీంద్రనాథ్‌ఠాగూర్, సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ పేర్లతో నాలుగు బృందాలకు నాయకులను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. జైసూర్య మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవడానికి కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శాంత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హరితహారంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. స్వాగత నృత్యం, మార్చ్‌ఫాస్ట్ (కవాతు) ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారి విజయభాస్కర్ తెలిపారు. అంబర్‌పేట ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, ప్లేగ్రౌండ్ పరిధిలో ఉదయం 11.30 నుంచి ఒంటిగంట వరకు, అయ్యప్ప టెంపుల్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మరిన్ని బస్సులు నడపాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా మరిన్ని బస్సులు నడపాలని సీపీఎం ముషీరాబాద్ జోన్ సీనియర్ నాయకులు బాబన్న, శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల బస్టాప్ వద్ద ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్సుల సంఖ్య పెంచకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎం నాయకులు పాషా, విమల, బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్ల సాధన కోసం

నేటి నుంచి ఢిల్లీలో ఆందోళన

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుల గణన తర్వాతనే దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6 నుంచి 10 వరకు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోమవారం బాగ్‌లింగంపల్లిలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు బీసీ కులగణన అంశాన్ని పరిశీలించకుండా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కుల గణన జరిగితే దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయన్నారు. సమావేశంలో సంఘం నాయకులు తులసి శ్రీనివాస్, మారేపల్లి లక్ష్మణ్, ఎ. మల్లేష్, రాజు ముదిరాజ్, శివ, దుర్గం శ్రీనివాస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

క్వారీలపై వడ్డెర్లకు హక్కు కల్పించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాయి, క్వారీలపై వడ్డెర్లకు హక్కు కల్పించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరవల్లి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. వడ్డెర్లకు క్వారీలపై హక్కు కల్పించాలని అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యేకు చిక్కడపల్లిలోని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కృతజ్ఞత సభ నిర్వహించారు. వడ్డెర సంఘం నాయకుడు ఓర్సు యాదయ్య, ట్రస్టు సభ్యులు డా. ఓర్సు కృష్ణయ్య, ఎత్తరి అంతయ్య, జెరిపేటి నారాయణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బోడేపూడి స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రైతాంగ పోరాట యోధుడు బోడేపూడి వెంకటేశ్వరరావు 27వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల విధానాలు మారకుండా రైతుల ఆత్మహత్యలు ఆపడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఎం. శోభన్, రాహుల్, కౌసల్య అంజనేయులు పాల్గొన్నారు.

'సంప్రదాయ, జానపద కళల పరిరక్షణ గానసభ లక్ష్యం'

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ, జానపద కళల పరిరక్షణ త్యాగరాయగానసభ లక్ష్యం అని గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అన్నారు. గానసభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తెలుగు జానపద శాస్త్రీయ కళల వేదిక- నిత్య వేడుక శీర్షికతో సంగీత నృత్యగురువు టీకే దుర్గ బృందంచే కర్ణాటక సంగీత గానగోష్ఠి మధురంగా జరిగింది. ఈ సందర్భంగా గురు దుర్గను జనార్దనమూర్తి సత్కరించారు. కార్యక్రమంలో శాస్త్రి, అపర్ణ, మల్లాది ఉష, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ అంబేడ్కర్‌నగర్‌లో మట్టిని టిప్పర్‌లో పోస్తున్న కార్పొరేటర్ రవిచారి



చిక్కడపల్లిలో మట్టి తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్



పార్శీగుట్టలో చెత్తకుప్పను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

వాడవాడలా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- మట్టికుప్పలు, చెత్తా చెదారం తొలగింపు

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో చెత్త, మట్టికుప్పల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహినుద్దీన్ తెలిపారు. సోమవారం అంబేడ్కర్‌నగర్‌లో పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ.. రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్, భోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్లలో పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పల తొలగింపు పనులను చేపట్టామన్నారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయొద్దని సూచించారు. కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ.. ఆజామాబాద్ పారిశ్రామికవాడలో మట్టి, చెత్త కుప్పలను తొలగించామన్నారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి, అంబేడ్కర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు ఎర్రం శేఖర్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాగ్అంబర్‌పేటలో..

బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట, పోచమ్మబస్తీ, కుమ్మరబస్తీ, రెడ్‌బిల్డింగ్ చౌరస్తా తదితర ప్రాంతాలలో డివిజన్ వార్డు ఇన్‌చార్జి పవన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డును శుభ్రం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది హరినాథ్‌గౌడ్, ఇమాం ఖాన్, అంజనేయులు, నర్సింహ, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.



బాగ్అంబర్‌పేటలో రోడ్డును శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి తదితరులు

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

చిక్కడపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి, బాపూనగర్‌లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాంధీనగర్ డివిజన్‌లో చెత్తను తొలగించి మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. డెంగీ, మలేరియా, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, ఏఎంసీ ప్రవీణ్‌చంద్ర ఎంటమాలజీ, పారిశుధ్యం, హార్టికల్చర్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్ గుల్షన్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ గౌసుద్దీన్, జీహెచ్ఎంసీ సిబ్బంది

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం పార్శీగుట్ట శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టికుప్పలను తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్, నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, శ్రీనివాస్, జీహెచ్ఎంసీ సిబ్బంది నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో..

భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈనెల 9 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఏలు హరినాథ్, రజీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఇంటికొక మొక్క నాటాలి

నల్లకుంట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటికొక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. సోమవారం నల్లకుంట డివిజన్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రోడ్లు, అంతర్గత రహదారులలో వ్యర్థాల తొలగింపు, నాలాల్లో పూడికతీత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైస్వాల్‌గార్డెన్ కాలనీలో..

గోల్నాక: జైస్వాల్ గార్డెన్ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో గోల్నాక డివిజన్ వార్డు అడ్మినిస్ట్రేషన్ అధికారి బన్సీలాల్, ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ వెంకటయ్య, ఎస్ఎఫ్ఏలు నూసారాజు, మల్లికార్జున్, చండీకేశ్‌రామ్, ఇబ్రాహీం, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి మాట్లాడుతూ.. పారిశుధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి, ఉపాధ్యాయులు



నల్లకుంటలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' ర్యాలీలో కార్పొరేటర్ యాకర అమృత తదితరులు



జైస్వాల్‌గార్డెన్ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి



బండమైసమ్మనగర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్-15 డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ జి. రచనశ్రీ సూచించారు. సోమవారం బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలులో డీబీఆర్ మిల్ హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే హెల్త్ క్యాంపును డీఎంసీ, కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వైద్య శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ మైత్రేయి, ఎంటమాలజిస్ట్ విభాగం అధికారి మహేష్‌కుమార్, ఏఎన్ఎం సుశీల, మలేరియా విభాగం సూపర్‌వైజర్లు అశోక్‌వర్ధన్, కృష్ణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ వై.హేమలత కోరారు. సోమవారం కాచిగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, ఆర్ సంతోష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్

నల్లకుంట: బస్తీ దవాఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. సోమవారం తిలక్‌నగర్, నర్సింహ బస్తీలోని బస్తీ దవాఖానాలను ఆమె సందర్శించారు. వైద్యులు, సిబ్బందిని అడిగి ప్రజలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ కన్వీనర్ కేబీ నర్సింగ్‌రావు, నాయకులు ఎం.మురళీయాదవ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్లకు ఉపాధి కల్పించాలంటూ నిరాహారదీక్ష



నిరాహారదీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

కవాడిగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకంతో ఉపాధి కోల్పోయిన విద్యుత్ బిల్ కలెక్టర్లకు ఈఆర్‌ఓ, ఎస్ఈ, డీఈ కార్యాలయాల్లో ఉపాధి కల్పించాలని స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు కె. ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, పీస్ రేట్ విధానం రద్దు చేసి లేబర్ కమిషన్ ఇచ్చిన జీవో నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు నేరుగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వి. గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో సుమారు 600 మంది బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి బిల్లులపై క్యూఆర్‌కోడ్ ఏర్పాటు చేస్తుండడంతో బిల్ కలెక్టర్లకు కమీషన్ తగ్గిపోతుందన్నారు. దీంతో 600 కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. బిల్ కలెక్టర్లకు న్యాయం చేయకపోతే యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ధర్నాలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

బాల కామేశ్వరరావుకు ఘంటసాల గానరత్న అవార్డు

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాడిన శివశంకరితోపాటు పలు పాటలను బాలకామేశ్వరరావు పాడి మెప్పించే గాయకుడు అని ప్రముఖులు ప్రశంసించారు. బుక్‌రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీ రాగ సినీ మ్యూజికల్ సంయుక్తంగా త్యాగరాయగానసభలో సోమవారం సాయంత్రం సినీగీత విభావరి నిర్వహించాయి. బాలకామేశ్వరరావు, శ్యామలనారాయణ తదితరులు నాటి సినీ గీతాలు మధురంగా ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నృసింహ దేవర ఆదినారాయణ మూర్తి బాలకామేశ్వరరావును ఘంటసాల గానరత్న అవార్డుతో సత్కరించారు. ఘంటసాల గళాన్ని అందిపుచ్చుకున్న ప్రతిభాశాలి బాలకామేశ్వరరావు అని అభినందించారు. గాయకుడు త్రినాథరావు, హైకోర్టు విశ్రాంత ప్రత్యేక మేజిస్ట్రేట్ లంక త్యాగరాజు, సంస్థ కార్యదర్శి అలివేలు, అధ్యక్షుడు టీవీపీఎస్ నారాయణ పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో నివసిస్తున్న డీఎస్ సుశీల(68)అగ్రికల్చర్ విభాగంలో పనిచేసి రిటైర్ అయ్యారు. పనిమీద మైసూర్ వెళ్లారు. హైదరాబాద్ రావడానికి మైసూర్‌లో మైసూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కర్నూలు వద్ద ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో 15 గ్రాముల బంగారు నల్లపూసల తాడు. రూ.30,800, సెల్‌ఫోన్ ఉంది. బాధితురాలు సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

అదృశ్యమై మూడునెలలైనా లభించని ఆచూకీ

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమై మూడు నెలలైనా ఆచూకీ లభించలేదు. అచ్చయ్యనగర్‌కు చెందిన జైని ప్రకాష్(58) ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తుంటాడు.పనిలో భాగంగా అప్పుడప్పుడు వేరే ప్రాంతాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ ఏడాది ఏప్రిల్ 26న పనిమీద ఆదిలాబాద్ వెళ్లాడు. 29న బెంగళూరు వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తోంది. ప్రకాష్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు చిక్కడపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినారెకు సంగీత నివాళి



గాయనీగాయకులను సన్మానించిన సినారె మనుమడు, మనుమరాలు

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత కవి డా. సి. నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా పాటకు పట్టాభిషేకం పేరిట ఆయనకు సంగీత నివాళి అర్పించారు. జంటనగరాలకు చెందిన ప్రముఖ గాయకులు బాలకామేశ్వరరావు, వెఎస్ రామకృష్ణ, సురేఖ, గీతాంజలి, ప్రశాంతి, సుజారమణ, ఇందు నయన సినారె రాసిన సోలో, యుగళగీతాలను ఆలపించారు. సినారె మనుమడు, మనుమరాలు లయన చరణ్, కాంతికిరణ్, అన్వేష్ గాయనీగాయకులను సత్కరించారు.

ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే వర్గీకరణపై సుప్రీం తీర్పు



మాట్లాడుతున్న పల్లెల వీరాస్వామి

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన పోరాటం - సుప్రీంకోర్టు తీర్పు పై బంధు సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలితాలు జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు అందాల్సిన అవసరం ఉందన్నారు. ఐఏఎస్ విశ్రాంత అధికారి ఎ. భరత్ భూషణ్ మాట్లాడుతూ.. ఎంతోమంది ప్రాణ త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అని అన్నారు. మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఓయూ ప్రొఫెసర్ నతానియేల్ కూడా మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు నల్లా రాధాకృష్ణ, గండి కృష్ణ, వి. నర్సింహ, గడ్డి యాదయ్య, గ్యార శ్రీనివాస్, ఎర్ర దేవదానం, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



వర్గీకరణకు మద్దతుగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ తదితరులు

వర్గీకరణను వ్యతిరేకిస్తే అంబేడ్కర్‌ను వ్యతిరేకించినట్లే..

కవాడిగూడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తే అంబేడ్కర్‌ను వ్యతిరేకించినట్లేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ సోమవారం సాయంత్రం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణను కొంత మంది వ్యతిరేకించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహ, శేఖర్, శ్రీనివాస్, శాంసన్‌రాజు, శివకుమార్ పాల్గొన్నారు.



శివంరోడ్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నేతలు

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగంపై కేవీపీఎస్ నిరసన

గోల్నాక, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై కేవీపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల చర్యను వ్యతిరేకిస్తూ సోమవారం శివం రోడ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్, కార్యదర్శి బి.సుబ్బారావు మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లో దళిత మహిళ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. మహిళను చిత్రహింసలకు గురిచేసిన డీఐతోపాటు పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఐ రాంరెడ్డిని అరెస్ట్ చేసి అట్రాసిటీ కేసు నమోదు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎం.మహేందర్, జి.రాములు, వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్‌కు పాఠశాల స్థాయి నుంచే బాటలు వేసుకోవాలి'

రాంనగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్‌కు పాఠశాల స్థాయి నుంచే బాటలు వేసుకోవాలని ఎయిర్‌ఫోర్స్ విభాగం రిటైర్డ్ కమాండర్ జి. శ్రీనివాస్ సూచించారు. సోమవారం డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికల అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఎయిర్‌ఫోర్స్ విభాగం అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ తదితరులు పాల్గొన్నారు.